సాక్షి అనకాపల్లి

ఆదివారం । 31 । ఆగస్టు । 2025

కుడ్యం కళాత్మకం



కె.జె.పురానికి చెందిన సూక్ష్మ కళాకారుడు శరగడం అచ్యుత గంగకన్న వరప్రసాదు కుడ్యాలను కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. పెన్సిల్ ముళ్లు, సుద్ద ముక్క, సబ్బులపై సూక్ష్మ కళాకృతులను రూపొందించి ప్రశంసలు పొందుతున్నారు.

8లో



మాల సామాజిక వర్గంపై కుట్రలు

సీఎం చంద్రబాబు మాల సామాజిక వర్గాన్ని అణగదొక్కుతున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ విమర్శించారు.

8లో



సిరులతల్లికి తులసిపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



మనగ్రోమోర్ ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

దేవరాపల్లి: స్థానిక ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మనగ్రోమోర్ షాపు, సురేష్ జనరల్ స్టోర్స్‌లో విజిలెన్స్ ఎస్‌ఐ బి.రవికుమార్, కానిస్టేబుల్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి ఎల్.వై. కాంతమ్మ సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా యూరియా నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్‌ల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు ఎరువులు విక్రయించే సమయంలో మనగ్రోమోర్ షాపు నిర్వాహకులు బిల్లుబుక్‌లు సక్రమంగా నిర్వహించకపోవడాన్ని గుర్తించారు. దీంతో తాత్కాలికంగా ఎరువుల విక్రయాలు నిలిపివేయాలని షాపు యజమానిని ఆదేశించారు.

బైలపూడిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్



మాట్లాడుతున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

చీడికాడ: మండలంలోని బైలపూడిలో గంజాయి రవాణా, ఇతర అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను శనివారం నిర్వహించారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో కె.కోటపాడు సీఐ పైడిపునాయుడు, స్థానిక ఎస్‌ఐ బి.సతీష్ , 15 మంది ఎస్‌ఐలు, 100 మంది పోలీసు సిబ్బంది ఉదయం 4 నుంచి 8 గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని 13 బైక్‌లు, ఒక ఆటో, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ శ్రావణి తెలిపారు. ఈ గ్రామంలో గంజాయి కేసుల్లో ఇప్పటి వరకు 38 మంది అనుమానితులు, 92 మంది నిందితులున్నారన్నారు. గంజాయి కేసుల్లో ఈ గ్రామానికి చెందిన 11 మంది కారాగార శిక్ష అనుభవిస్తున్నారని, ఒక్కొక్కరికీ రూ.లక్ష జరిమానా విధించినట్టు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, గంజాయి రవాణా, విక్రయానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

పెద్దేరు నుంచి వరద నీరు విడుదల



పెద్దేరు జలాశయం నుంచి విడుదల చేస్తున్న వరద నీరు

మాడుగుల: మండలంలోని పెద్దేరు జలాశయం నుంచి 300 క్యూసెక్కుల వరద నీటిని శనివారం సాయంత్రం విడుదల చేశారు. జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు పడుతుండడంతో వరద నీరు కొనసాగుతోందని జలాశయం అధికారులు తెలిపారు. ఈనెలలో ఇప్పటికి నాలుగు సార్లు మొత్తం 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు వారు చెప్పారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఎవరూ పెద్దేరులో దిగరాదని తహసీల్దార్ రమాదేవి సూచించారు.

డ్రా ద్వారా రెండు బార్ల కేటాయింపు



కలెక్టరేట్‌లో డ్రా తీస్తున్న డీఆర్వో సత్యనారాయణ

తుమ్మపాల: నూతన బార్ విధానం 2025–28లో భాగంగా కలెక్టరేట్‌లో శనివారం డీఆర్వో సత్యనారాయణ డ్రా తీసి, దరఖాస్తుదారులకు రెండు బార్‌లు కేటాయించారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో జనరల్ కేటగిరిలో ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు, గీత కులాలకు కేటాయించిన ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు స్వీకరించి, డ్రా తీసినట్టు జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి వి.సుధీర్ తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో కేటాయించిన రెండు బార్లకు గాను ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ఆయన చెప్పారు.

ఆర్‌ఈసీఎస్‌లో వసూల్ రాజాలు





- కోర్టు ఖర్చులు, ప్రజాప్రతినిధుల కోసమంటూ బలవంతంగా కలెక్షన్
- పదేళ్లలోపు సర్వీసుకు రూ.లక్ష, 20 ఏళ్లు ఉన్నవారికి రూ.2 లక్షలు, ఆపై సర్వీసు ఉన్నవారికి రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- ఇవ్వని వారికి ఇబ్బందులు తప్పవని బెదిరింపులు

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ(ఆర్‌ఈసీఎస్)లో కొందరు కాంట్రాక్ట్ పే వర్కర్స్ (సీపీడబ్ల్యూ) ఉద్యోగ నాయకులు వసూళ్లకు తెరలేపారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేసే 229 మంది కార్మికులు, ఉద్యోగులకు 'సమానపనికి–సమాన వేతనం' కల్పించాలంటూ పదేళ్ల క్రితమే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇది క్షేత్రస్థాయిలో అమలుకాలేదు. ఇదే అదునుగా అదే సంస్థలో పనిచేసే సీపీడబ్ల్యూ ఉద్యోగుల నుంచి కొత్త తరహా వసూళ్లకు పాల్పడుతున్నారు. సమాన పనికి..సమాన వేతనం అమలయ్యేలా చూసేందుకు న్యాయస్థానానికి వెళ్లాలని, కోర్టు ఖర్చులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ముడుపులిచ్చేందుకు నగదు అవసరమంటూ వసూళ్లు ప్రారంభించారని సమాచారం. సహచర ఉద్యోగులను మూడు శ్లాబ్‌లుగా విభజించి నగదు డిమాండ్ చేస్తున్నట్టు భోగట్టా. పదేళ్ల లోపు సర్వీసు ఉన్నవారు రూ.లక్ష , పది నుంచి 20 ఏళ్లు ఉన్నవారికి రూ.2 లక్షలు, ఆపై సర్వీసు ఉన్నవారికి మూడు లక్షల చొప్పున ఇవ్వాలంటూ సీపీడబ్ల్యూ యూనియన్‌లో ఉన్న ముగ్గురు నాయకులు సహచర సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే వీరిలో కొందరు నగదు ఇచ్చి న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నా..మరి కొందరు వారికి వచ్చే అరకొర జీతంలో అడ్వాన్స్‌గా రూ.15 వేల చొప్పున ఇచ్చేందుకు అయిష్టత చూపుతున్నారు. అయినా విడిచిపెట్టకుండా ముందుగా రూ.15 వేల చొప్పున బలవంతంగా నాయకులు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇచ్చేందుకు ఎవరైనా నిరాకరిస్తే ఉద్యోగం పోయేలా చేస్తామంటూ వారిని బెదిరిస్తున్నారు. వసూలు చేస్తున్న నగదులో కొంత సొమ్ము స్థానిక ప్రజాప్రతినిధులకు, మరికొంత న్యాయస్థానంలో కేసు వేసేందుకు అయ్యే ఖర్చులకు వినియోగించనున్నట్టు ఆ ముగ్గురూ చెబుతున్నారు. శ్లాబ్‌ల ప్రకారం జీతాల వారీగా కేటాయించిన డబ్బుల్లో సగం వరకూ ఇస్తే చాలని, మిగతా డబ్బులు సమాన పనికి సమాన వేతనం అమలైన తరువాత తొలి జీతం పడిన వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని తెలిసింది.

నిరాశ నిస్పృహలో కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఆర్‌ఈసీఎస్ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగులు కాకుండా 229 మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు వీరు కూడా సమానంగా పనిచేస్తున్నారు. వీరందరికీ సమాన పనికి సమాన వేతనం కల్పించాలంటూ 2014లో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పటికీ ఆ ఆదేశాలు అమలు కాకపోవడంతో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర నిరాశనిస్పృహలో ఉన్నారు. ఇదే అదునుగా కొంతమంది నాయకులు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని, అసలే తక్కువ జీతాలతో పనిచేస్తున్న తాము అంత మొత్తంలో ఎలా ఇవ్వగలమని వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కోర్టు ఉత్తర్వులు అమలు జరిగే చూడాలని, తమ జీతాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

దోమ తెరలను సక్రమంగా వినియోగించుకోవాలి

కలెక్టర్ విజయ కృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: జిల్లాలో అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలకు పంపిణీ చేసిన దోమతెరలను విద్యార్థులందరూ సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి, ఇతరులకు సాయం చేసేలా ఎదగాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా రెండవ సంవత్సరంలో జిల్లాలో అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్‌లో విద్యార్థులకు 10,429 దోమతెరలను పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో వీటిని అందజేసినట్టు తెలిపారు. జిల్లాలో 50 వెనుకబడిన తరగతి సంక్షేమ వసతి గృహాలకు 2,400 దోమ తెరలు, 30 సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు 2,122, ఐదు మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ వసతి గృహాలకు 1,075 తెరలు, 19 గిరిజన సంక్షేమ వసతి గృహాలకు 1,220, ఎనిమిది సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలకు 1,712 తెరలు, 20 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు 1,700, నాలుగు ఆశ్రమ పాఠశాలలకు 200 చొప్పున పంపిణీ చేసినట్టు చెప్పారు. ప్రతి విద్యార్థి దోమ తెరను వినియోగించేలా వసతి గృహ సంక్షేమ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి జి.రామారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీకి నిర్ధారణ పరీక్షలు

తుమ్మపాల: ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేసేందుకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్టు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఆర్.జయప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉపకరణాలు అందజేసేందుకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వచ్చేనెల 3 నుంచి 10వ తేదీ వరకు పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 3న చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, 4న వి.మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 6న అనకాపల్లి మున్సిపల్ టౌన్ బాలికల ఉన్నత పాఠశాల, 8న యలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 9న పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 10న నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం శిబిరాలు నిర్వహించి, వైద్య పరీక్షలు జరపనున్నట్టు తెలిపారు.

అక్టోబర్ 15న ఏయూ స్నాతకోత్సవం

మద్దిలపాలెం(విశాఖ): ఆంధ్ర విశ్వవిద్యాలయం 91, 92వ సంయుక్త స్నాతకోత్సవం అక్టోబర్ 15వ తేదీన జరగనుంది. కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవరంగం వేదికగా జరగనున్న స్నాతకోత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు రిజిస్ట్రార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. స్నాతకోత్సవానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారు.

ముగిసిన 'డీఎస్సీ' సర్టిఫికెట్ల పరిశీలన



అభ్యర్థుల సర్టిఫికెట్ల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ఆరిలోవ(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో డీఎస్సీ–2025 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగిసింది. జిల్లాలో 1,426 పోస్టులకు సంబంధించి ఓపెన్ కేటగిరీతో పాటు రిజర్వేషన్ కేటగిరీల మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ పరిశీలన ఈ నెల 28న విశాఖ ఉక్కునగరం విమల విద్యా పరిషత్‌లో ప్రారంభమైంది. మొదటి రెండు రోజుల్లో 1,426 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ రెండు రోజుల్లో హాజరు కాలేకపోయిన వారికి, అలాగే హాజరైనప్పటికీ ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా లేని, చిరునామాలు, పేర్లు తారుమారు అయిన 26 మంది అభ్యర్థులకు శనివారం మరో అవకాశం కల్పించినట్లు డీఈవో ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. వీరంతా సరైన ధ్రువీకరణ పత్రాలతో రావడంతో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఈ అభ్యర్థుల్లో కొందరు రెండు నుంచి నాలుగు పోస్టులకు ఎంపికయ్యే ర్యాంకులు సాధించారని, వారు ఏ పోస్టులకు సానుకూలత చూపుతారో దానిని బట్టి రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన ఉండే అవకాశం ఉందన్నారు.

అసైన్డ్ భూముల అమ్మకాలను నిరోధించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి: అసైన్డ్ భూముల అమ్మకాలను నిరోధించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. గిరిజన పంచాయతీ వాలాబులో అసైన్డ్ భూములను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని వారి భూములను కొందరు 99 సంవత్సరాల లీజు పేరిట యథేచ్ఛగా కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే 40 శాతం మేర అమ్మకాలు జరిగిపోయాని తెలిపారు. వాలాబుతో పాటు గరిశింగి, తామరబ్బ, చింతలపూడి, చీడికాడ, వి.మాడుగుల, రావికమతం, రోలుగుంట, గొలుగొండ, నాతవరం, కోటవురట్ల మండలాల్లో నాన్ షెడ్యూల్డ్ గిరిజన ప్రాంతం అంతటా ఇదే పరిస్థితి ఉందన్నారు. తక్షణమే రెవెన్యూ అధికార్లు స్పందించి ఇప్పటి వరకు జరిగిన భూముల అమ్మకాలపై సర్వే జరిపి అసైన్డ్ చట్టం 1/77 ప్రకారం పట్టాదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ తుహిన్ సిన్హా



కానిస్టేబుళ్లతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: అనకాపల్లి, విశాఖ జిల్లాలో వివిధ కోర్టుల్లో ఉన్న కేసుల చార్జ్‌షీట్లను త్వరితగతిన దాఖలు చేయాలని, సాక్షులకు సమయానుసారం బ్రీఫింగ్ ఇవ్వాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. తన కార్యాలయంలో శనివారం కోర్టు కానిస్టేబుళ్లు, సీఎంఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులు, సమన్లు, నాన్–బెయిల్‌బుల్ వారెంట్లు, పీటీ కేసులపై కోర్టు కానిస్టేబుళ్లు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. బాధితులకు న్యాయం జరిగేలా చూసి, నిందితులకు శిక్షలు పడేలా కోర్టు విధులను సమర్థంగా నిర్వహించాలన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలన్నారు. సాక్షులు ఎటువంటి ఒత్తిడులు, ప్రలోభాలకు గురికాకుండా సమయానికి కోర్టులో హాజరు కావడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. వచ్చేనెల 13న జరిగే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా దృష్టి సారించాలని సూచించారు. శిక్షల శాతం పెంపులో కోర్టు కానిస్టేబుళ్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, స్టేషన్ స్థాయిలో కోర్టు సంబంధిత సమస్యలను నేరుగా విని పరిష్కరించేందుకు అందుబాటులో ఉండాలన్నారు. కేసుల పురోగతిని నిరంతరం అధికారులకు తెలియజేయాలని, ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 39 మంది నిందితులకు శిక్షలు పడ్డాయని ఎస్పీ చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మోహనరావు, డీసీఆర్‌బీ సీఐ లక్ష్మణమూర్తి, సీఎంఎస్ ఎస్‌ఐ రమణయ్య పాల్గొన్నారు.

బోధనతో పాటు వ్యక్తిత్వ వికాసం

8లో

గీతం గుప్పిట్లో ఏయూ?

- ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'గీతం'పెత్తనం
- ప్రైవేట్ వర్సిటీపై వీసీ అవ్యాజ ప్రేమ
- సీనియర్లని కాదని రిజిస్ట్రార్‌గా రాంబాబు నియామకం
- గతంలో గీతంలో కలిసి పనిచేసిన రాంబాబు
- అప్పుడు వీసీ, ఇప్పుడు రిజిస్ట్రార్ పేరుని సిఫార్సు చేసిన ఎంపీ భరత్



సాక్షి, విశాఖపట్నం: చారిత్రాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయంపై 'గీతం'పెత్తనం పెరుగుతోందా? విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాల్సిన వర్సిటీని కూటమి ప్రభుత్వం రాజకీయ క్రీడకు వేదికగా మారుస్తోందా? ప్రస్తుత పరిణామాలు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం ఇస్తున్నాయి. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కూడా పక్కనే ఉన్న ప్రైవేట్ వర్సిటీ కోసం ఏయూ ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నించిన టీడీపీ.. ఇప్పుడు మళ్లీ అదే బాటలో పయనిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గీతంలో పనిచేసిన వ్యక్తిని వైస్ చాన్సలర్‌గా నియమించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆ తాను ముక్కనే రిజిస్ట్రార్‌గా నియమించడం వివాదాస్పదమవుతోంది. ఏయూలో ఎంతోమంది సీనియర్లు ఉండగా, వారిని కాదని గీతం వర్సిటీతో సంబంధమున్న వ్యక్తిపై అవ్యాజ ప్రేమ చూపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీసీ నియామకంలాగే.. ప్రస్తుత రిజిస్ట్రార్ నియామకం వెనుక ఎంపీ భరత్ సిఫార్సు ఉందన్నది బహిరంగ రహస్యం.

అస్తవ్యస్తంగా ఏయూ పాలన

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అస్తవ్యస్త పాలన కొనసాగుతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వర్సిటీని రాజకీయానికి బలి చేస్తున్నారు. గతంలో పనిచేసిన వీసీ, రిజిస్ట్రార్‌లపై బెదిరింపులకు పాల్పడి.. బలవంతపు రాజీనామాలు చేయించిన కూటమి నేతలు.. తమ వారికి ఆ కుర్చీల్లో కూర్చోబెట్టారు. ముఖ్యంగా గీతం యూనివర్సిటీ చైర్మన్, ఎంపీ భరత్ కనుసన్నల్లోనే కీలక పదవుల నియామకాలు జరుగుతుండటం చూస్తుంటే.. విశ్వ విద్యాలయం ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని ఏయూ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. విద్యా బోధన, ఇతర ఏయూ అభివృద్ధిని పక్కనపెట్టేసి.. కుర్చీలాటలాడుకోవడం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది. నాలుగు రోజుల కిందట ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేశారు. తమ వ్యక్తిని ఆ పదవిలో నియమించుకోవడం కోసం వీసీ రాజశేఖర్.. ఆయనపై పొమ్మన లేక పొగపెట్టినట్లు తెలుస్తోంది. వీసీ వైఖరి నచ్చకపోవడం, పదవీకాలం ముగియనుండటంతో త్వరగా వైదొలగాలని కూటమి నేతల నుంచి వచ్చిన ఒత్తిడులను తట్టుకోలేకే ధనుంజయరావు రాజీనామా చేశారని సమాచారం. ఆ వెంటనే, ఎంపీ భరత్ మరోసారి చక్రం తిప్పి, గీతం వర్సిటీతో సంబంధం ఉన్న వ్యక్తిని ఆ కుర్చీలో కూర్చోబెట్టేశారు.

వీసీ, రిజిస్ట్రార్.. ఇద్దరూ 'గీతం'వారే!

గత వీసీని బలవంతంగా రాజీనామా చేయించిన తర్వాత కూటమి నేతలు ఏయూను తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. ముఖ్యంగా ఎంపీ భరత్ ఏయూపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే, గతంలో గీతంలో పనిచేసి, ఆ తర్వాత ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విధులు నిర్వర్తించిన రాజశేఖర్‌ను ఏయూ వైస్ చాన్సలర్‌గా నియమించాలని పట్టుబట్టి మరీ పదవి కట్టబెట్టారు. ఇప్పుడు రిజిస్ట్రార్‌ను అర్ధాంతరంగా తొలగించడం వెనుక కూడా భరత్ కుట్ర ఉందన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పనిచేస్తున్న రాంబాబు గతంలో గీతంలోనూ విధులు నిర్వర్తించారు. రాంబాబును రిజిస్ట్రార్‌గా నియమించాలని భరత్ సిఫార్సు చేయడంతో, వీసీ ఆయన పేరును ఉన్నత విద్యామండలికి పంపించారు. ఆ తర్వాత ఎంపీ ప్రభుత్వ స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చి రాంబాబు నియామకానికి ఆమోదముద్ర వేయించారు. రాంబాబు కంటే ఎంతోమంది సీనియర్లు వర్సిటీలో ఉన్నా, వారందరినీ పక్కనపెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. వీసీ పూర్తిగా రాజకీయ పార్టీకి కొమ్ముకాస్తూ విశ్వవిద్యాలయ ప్రతిష్టను మంటగలుపుతున్నారని సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ వర్సిటీ మూలాలు ఏయూలో విస్తరించడం భవిష్యత్తులో విశ్వవిద్యాలయ ప్రతిష్టకు భంగం కలిగించవచ్చని ఆందోళన సర్వత్రా నెలకొంది.

బతికేదెట్లా...



- 80 శాతం వైకల్యం ఉన్నా పింఛన్ తొలగింపు
- బధిర యువతికీ నిలిపివేత
- కన్నీటి పర్యంతమవుతున్న దివ్యాంగులు



గూడె గౌరి



శెన్నంశెట్టి భువనేశ్వరి



సన్నివాడ ప్రవీణ్

కోటవురట్ల: పై చిత్రాల్లోని ముగ్గురూ గత ప్రభుత్వ హయాంలో దివ్యాంగ పింఛన్ పొందారు. కూటమి ప్రభుత్వం ఈ ముగ్గురితో పాటు కోటవురట్ల మండలంలో పలువురి పింఛన్లు నిలిపివేసి వారి పట్ల నిర్దయగా వ్యవహరిస్తోంది. దీంతో తాము ఎలా బతకాలని వారు గగ్గోలుపెడుతున్నారు. పందూరు గ్రామానికి చెందిన గూడె గౌరికి ఓ ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. కనీసం అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితిలో ఆమె తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఈమె దివ్యాంగ పింఛను పొందింది. ఈమెకు 80 శాతం వైకల్యం ఉండగా కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. పింఛను తొలగించడంతో మళ్లీ సదరంలో పరిశీలన చేయించుకోగా 20 శాతం వైకల్యం ఉన్నట్టు సర్టిఫికెట్ ఇచ్చారు. పింఛను కోల్పోవడంతో తీవ్ర ఆవేదన చెందుతోంది.

– ఇదే గ్రామానికి చెందిన శెన్నంశెట్టి భువనేశ్వరి పుట్టుక నుంచి వినికిడి లోపం, మూగ సమస్యతో బాధపడుతోంది. గత ప్రభుత్వంలో పింఛను అందుకోగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం పింఛను నిలిపివేసింది. మరో బాలుడు సన్నివాడ ప్రవీణ్ ఒక కన్ను పూర్తిగా కోల్పోగా గత ప్రభుత్వంలో పింఛను వచ్చేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పింఛన్ నిలిపివేసింది. ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు అతి తక్కువ వైకల్యం ఉన్నప్పటికీ పింఛను మంజూరు చేశారు. పాములవాకలో 25 మంది దివ్యాంగ పింఛన్లు తొలగించారు. ఇందులో ఐదు పింఛన్లు వోపీపీలో కలపగా మిగిలిన 19 మంది రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మండలంలో మొత్తం 1,041 దివ్యాంగ పింఛన్లు ఉన్నాయి. వీటిలో 109 వికలాంగ పింఛన్లు తొలగించినట్టు అధికారులు నోటీసులు ఇచ్చారు. 17 మందిని వోపీపీలో కలిపారు. అర్హత ఉన్నా పింఛన్లు తొలగించారని దివ్యాంగులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తమ పింఛన్లు పునరుద్ధరించాలని కన్నీటితో వేడుకొంటున్నారు. వైకల్యం లేకపోయినా రాజకీయ దన్నుతో పలువురికి వికలాంగ పింఛన్లు మంజూరుచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

ధ్యాన వేంకటేశ్వరస్వామికి విశేష అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని శనివారం వజ్ర కవచాలంకృతులతోపాటు వివిధ రకాల పూలు, తులసీమాలలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

లక్ష్యంతో చదివితో ఉజ్వల భవిష్యత్

మునగపాక: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రముఖ వైద్య నిపుణుడు పెతకంశెట్టి సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో జోగినాయుడు మాష్టారు గ్రంథాలయ వార్షికోత్సవాలు శుక్రవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జోగినాయుడు మాష్టారు గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన పలు రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలకు వచ్చి చదువుకునేలా అలవాటు చేసుకోవాలన్నారు. ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. గ్రంథాలయ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఈఎన్‌టీ వైద్యుడు సాయి రామకృష్ణ, పెద్దలు బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల వరహా నరసింగరావు, కొయిలాడ దశావతారం, మళ్ల రాజేష్, మళ్ల కన్నుంనాయుడు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: విద్యుత్ శాఖ డి–1 సెక్షన్ పరిధిలో 11కేవీ ఆర్టీసీ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతులు నిమిత్తం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీడర్ పరిధిలో విద్యుత్ వినియోగదారులు శాఖ ఉద్యోగులకు సహకరించాలని కోరారు.

గణేష్ లడ్డూ రూ.8 వేలు

పరవాడ : మండల పరిధి రావాడ శివారు బొట్టవానిపాలెంలో వినాయకుడి మండపం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన బందం శ్రీనివాసరావు రూ.8 వేలకు దక్కించుకున్నాడు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 43 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,570	4,570
రెండో రకం	3,680	3,680
మూడోరకం	3,100	3,400

అనకాపల్లి సినిమాలు

రాజా	:త్రిబాణధారి బార్బరిక్
సత్యనారాయణ స్క్రీన్-1	:కొత్తలోక
సత్యనారాయణ స్క్రీన్-2	:బ్రహ్మాండ
పర్తిసాయి	:మహావతార్‌నరసింహం (మ్యాట్నీ, సెకండ్ షో)
పర్తిసాయి	:అర్జున్ చక్రవర్తి (మార్నింగ్ షో, ఫస్ట్ షో)
షిర్డీసాయి	:కూలీ
వెంకటేశ్వర	:బన్ బట్టర్ జామ్
శ్రీ సత్య	:హరిహర వీరమల్లు
రామచంద్ర	:వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 85 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్–11, బీ పాజిటివ్–24, ఓ పాజిటివ్–44, ఏబీ పాజిటివ్–6 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 358 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 296 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

ట్రా‘ఫికర్’

పట్టణంలో జటిలమైన ట్రాఫిక్ సమస్య ● రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
రోడ్లపైనే వ్యాపారాలు ● వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు



పట్టణంలో పెరుగుబజార్ జంక్షన్ వద్ద ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన వ్యాపారులు

అనకాపల్లి: పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. ప్రధానంగా జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారితోపాటు వివిధ పనులు నిమిత్తం వచ్చే ప్రజలు, వాహనదారుల సంఖ్య మరింత పెరిగింది. దీనికితోడు పట్టణంలో చిల్లర వర్తకలు, పెద్ద దుకాణదారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. దాంతో రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ సమస్యను పరిష్కరించడంలో ఇటు ట్రాఫిక్ పోలీస్‌లు, అటు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ ప్రాంతాల్లోనే నిత్యం ట్రాఫిక్ సమస్య..

అనకాపల్లి శారదానది బ్రిడ్జి నుంచి సుంకరమెట్ట జంక్షన్, గాంధీనగరం జంక్షన్ నుంచి పూడిమడక జాతీయ రహదారి వరకూ ప్రధాన రహదారి కావడంతో పెద్ద దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటికి పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు రహదారులపై నిలిపివేయడంతో అటుగా వెళ్లే ఆటోలు, బస్‌లు, కార్లు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్సవాలు, పండగల సమయంలో ఈ సమస్య మరింత జటిలంగా మారుతోంది. దీనికి తోడు లోడింగ్, అన్‌లోడింగ్‌తో లారీలు రహదారులపైనే నిలుపుదల చేస్తున్నారు. పెద్ద దుకాణాల వద్ద చిన్నపాటి పార్కింగ్‌ను దుకాణ యజమానులు స్టాక్‌తో నింపేస్తున్నారు. దాంతో దుకాణాల్లో పనిచేసే సిబ్బంది రహదారులపైనే వాహనాలు నిలుపుదల చేస్తున్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు..

పట్టణ పరిధిలో మెయిన్‌రోడ్డులో ఇరువైపులా ఫుట్‌పాత్‌లను చిల్లర వర్తకులు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. కొంతమంది యజమానులు తమ దుకాణాల ముందు చిరువ్యాపారాలు చేసుకునేందుకు రోజుకు రూ.300 నుంచి రూ.600 వరకూ వసూలు చేస్తున్నారు. మరికొంత మంది డ్రైనేజీ వ్యవస్థపై బ్రిడ్జిలను ఆక్రమించి మరీ వ్యాపారాలు చేస్తున్నారు. దాంతో కాలువలో పూడికతీత పనులు చేయడంలో పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

రింగ్‌రోడ్డు, ఎన్టీఆర్ క్రీడా మైదానంలో జంక్షన్ వద్ద..

రింగ్‌రోడ్డు, ఎన్టీఆర్ క్రీడా మైదానం వద్ద బ్రిడ్జిలపై వ్యాపారాలు సాగించడంతో వాహనాలు యూటర్నింగ్ తిరిగే సమయంలో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నెల మామూళ్ల మత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ విషయంలో చోద్యం చూస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రింగ్‌రోడ్డు జంక్షన్ నుంచి జాతీయ రహదారి వరకూ..

రింగ్‌రోడ్డు జంక్షన్ నుంచి జాతీయ రహదారి వరకూ రహదారిపై ద్విచక్ర, భారీ వాహనాలు రోడ్డును ఆక్రమించి వాహనాల మరమ్మతులు చేయిస్తున్నారు. దాంతో ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఏర్పడుతోంది.





రింగ్‌రోడ్డులో ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లో నిరుపయోగంగా దుకాణాలు



సుంకరమెట్ట - జలగల మదుం జంక్షన్ మార్గంలో మరమ్మతులకు పార్కింగ్ చేసిన కార్లు



పట్టణంలో మెయిన్‌రోడ్డులో రహదారిపై అడ్డదిడ్డంగా ద్విచక్రవాహనాలు

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంలో అన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పడ్డాయి. దాంతోపాటు గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనులు నిమిత్తం ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. దాంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. దుకాణాల వద్ద ఖాళీ స్థలాలు లేకపోవడంతో రహదారులపై పార్కింగ్ చేస్తున్నారు.

– పి.ఓంనమఃశివాయ, అనకాపల్లి

చిరువ్యాపారులను తరలించాలి



కరోనా వంటి విపత్తుల సమయంలో చిరువ్యాపారులను రింగ్‌రోడ్డులో ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌కు తరలించారు. అక్కడ చిరువ్యాపారాలు బాగానే సాగాయి. కరోనా తగ్గుముఖం పట్టిన తర్వాత యథావిధిగా వ్యాపారాలు రోడ్లపైనే చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. కొంతమంది వ్యాపారులు డ్రైనేజీలను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టాలి.

– కె.హరనాథ్‌బాబు, అనకాపల్లి

హెచ్‌ఎం అప్పారావు అభినందనీయుడు



హెచ్‌ఎం అప్పారావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

కశింకోట: విద్యార్థులను తీర్చిదిద్దడమే కాకుండా పాఠశాలల పురోభివృద్ధికి దోహదపడిన ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి. అప్పారావు అభినందనీయుడని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. శనివారం స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి. అప్పారావు పదవీ విరమణ పురస్కరించుకొని ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పదవీ విరమణ చేస్తున్న అప్పారావు శేష జీవితాన్ని ఆనందమయంగా గడపాలని ఆకాంక్షించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎన్.వి.జె. ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవోలు సురేష్‌కుమార్, కె.ఎస్.ఎన్. మూర్తి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి. గోపీనాథ్, సైంటిస్టు చదరం శివాజీ, బాలికల హైస్కూలు హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, రిటైర్డు హెచ్‌ఎం బుద్ధ కాశీ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ మళ్ల ఉమామహేశ్వరరావు, నాగులాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు యల్లపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపీకృష్ణ, నాగులాపల్లి పాల సంఘం అధ్యక్షుడు దొడ్డి బుజ్జి, నాగులాపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డేడ బుజ్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణాల్లో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ సుబ్రహ్మణ్యం, ఏవో రంగాచారి

అనకాపల్లి: ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు (ఏడీఏ) సీహెచ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలో గాంధీ కూరగాయల మార్కెట్, మెయిన్‌రోడ్డులో ఎరువుల దుకాణాల్లో శనివారం ఆయన తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. వరి రైతులకు సకాలంలో ఎరువులు అందించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎరువులను ఎమ్మార్పీకి మాత్రమే అమ్మాలన్నారు. ఎక్కడైనా ఎక్కువ ధరకు అమ్మకాలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే దుకాణాలు సీజ్ చేస్తామన్నారు. రైతులు కోరిన యూరియా మాత్రమే ఇవ్వాలన్నారు. మరో రకం ఇచ్చినట్లయితే దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మిళిత విద్యను చేరువ చేయాలి



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం: సమ్మిళిత విద్య చేరువ చేసేందుకు కృషి చేయాలని రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యురాలు, అలగప్ప యూనివర్సిటీ స్పెషల్ ఎడ్యుకేషన్ రిహాబిలిటేషన్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య సుజాత మాలిని సూచించారు. ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులను ఉద్దేశించి శనివారం ఆమె వర్చువల్‌గా ప్రసంగించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్‌లు ఏర్పాటు కావాలని, కరికులంలో సరళత ఉండాలని ఆమె సూచించారు. నూతన విద్యా విధానం అందించిన సూచనలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలన్నారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులైన విద్యార్థులను గుర్తించి వారికి అనువైన బోధన, అభ్యసన విధానాలు అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా తన అనుభవాలను పంచుకుంటూ, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధించిన విధానాన్ని వివరించారు. ప్రత్యేక విద్యను బోధించే వారు నిరంతరం నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ జాతీయ విద్య విధానం అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. విభిన్న ప్రతిభావంతులను సాధారణ వ్యక్తులతో సమానంగా తీర్చిదిద్దాలన్నారు. విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో మూడు రోజులపాటు కంటిన్యూయింగ్ రీహాబిలిటేషన్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆచార్య డి.నగరాజ కుమారి, డాక్టర్ ప్రకాష్ల రచించిన స్పెషల్ ఎడ్యుకేషన్ అండ్ మల్టిపుల్ డిజేబిలిటీస్ పుస్తకాన్ని వీసీ రాజశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్స్‌ను సత్కరించారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజ కుమార్, డాక్టర్ ఆలీ, డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్ ప్రకాష్, డాక్టర్ ప్రవీణ దేవి, డాక్టర్ రాము పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల ఉపాధిని కాపాడండి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గీత కార్మికులు

నర్సీపట్నం : కల్లుగీత కార్మికుల ఉపాధిని కాపాడండి అంటూ కల్లుగీత కార్మికులు శనివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆర్డీవో, ఎక్సైజ్ సీఐకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర దేవుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్లుగీత కార్మికులను ఆదుకుంటుందని ఆశించామన్నారు. మద్యం దుకాణాలను రాజకీయ నాయకులకు సంబంధించిన వారికి కేటాయించారన్నారు. గీత వృత్తికి నష్టం చేసేలా ఉన్న బెల్టుషాపులను నియంత్రించడం లేదన్నారు. గీత కార్మికుల కార్పొరేషన్‌కు తగిన నిధులు ఇవ్వడం లేదన్నారు. కేరళ వంటి రాష్ట్రాల్లో తాటికల్లు అధారిత ఆహార పదార్థాలు తయారీకి ప్రభుత్వం కార్పొరేషన్ పెట్టి ప్రోత్సహిస్తుందన్నారు. ఆ తరహాలో ఏపీలో ప్రవేశపెట్టాలన్నారు. లేకుంటే భవిష్యత్తులో కల్లుగీత కార్మికులతో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ఎన్.రాజుబాబు, లోవరాజు, రమణ, చిన్న, సత్యం పాల్గొన్నారు.

పట్టణంలో అన్నసమారాధన



అరటిపళ్లు హోల్‌సేల్ మార్కెట్ వినాయకుని వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో భక్తులకు ప్రసాదాన్ని అందిస్తున్న దాచేపల్లి ప్రవీణ్ కుటుంబ సభ్యులు

అనకాపల్లి: స్థానిక అరటిపళ్ల హోల్‌సేల్ మార్కెట్‌లో వినాయక నవరాత్రులను పురస్కరించుకుని ప్రజా సేవకుడు కొణతాల సీతారాం ఆధ్వర్యంలో మధ్యాహ్నం వినాయక ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వినాయకున్ని దర్శించుకుని, అన్నసమారాధనలో పాల్గొన్నారు. అరటిపళ్ల హోల్‌సేల్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ క్రీడా మైదానంలో...

స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 126 అడుగుల భారీ గణపతి(లక్ష్మీగణపతి) ఆలయం వద్ద దాచేపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో వంద కేజీల ప్రసాదాన్ని భక్తులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టును వెడల్పు చేయాలని వినతి

తుమ్మపాల: మండలంలోని మార్టూరులో సచివాలయం వెనుక డ్రైనేజీ కల్వర్టును 20 అడుగుల వెడల్పు చేసిన తర్వాత సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ గ్రామస్తులు శనివారం పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ విభాగం అధికారులకు వినతిపత్రం అందించారు. శిథిలావస్థ కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి వెడల్పు చేయకుండా చేపట్టనున్న సీసీరోడ్డు నిరుపయోగమన్నారు. తీవ్ర వర్షాలకు సమీప కాలువలో నీటి ఉధృతికి సీసీరోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అధికారులు పునరాలోచన చేయాలన్నారు. సీసీరోడ్డుకు వెచ్చిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతోపాటు అదనంగా మరికొన్ని నిధులు కేటాయించి కల్వర్టు వెడల్పు చేయాలని కోరారు.

వరసిద్ధి వినాయకునికి పూజలు



వరసిద్ధి వినాయక విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

కశింకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి పూజా కార్యక్రమాలు జరిపారు. ఆదివారం మధ్యాహ్నం యువ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుబ్బారావు పంతులు వీధిలో వినాయక ఉత్సవాలు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ భాగ్యలక్ష్మి

సబ్బవరం : ఆరోగ్యవంతమైన యువత భారతదేశ నిర్మాణానికి వెన్నుముక అని, ఎటువంటి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ భాగ్యలక్ష్మి సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం లీగల్ సెల్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందని, చట్టపరమైన శిక్షలకు గురికావాల్సి ఉంటుందని అవగాహన కల్పించారు. అనంతరం అందరినీ చైతన్య పరిచేందుకు విద్యార్థులు ఓ నాటిక ప్రదర్శించారు. ప్రొఫెసర్ రఫాత్ ఖాన్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అఫీసర్ డాక్టర్ లెక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



నిరసన ర్యాలీ చేస్తున్న ఆటో వర్కర్సు

కె.కోటపాడు : స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో వర్కర్సు ఉపాధి కోల్పోయారని ఆటో వర్కర్సు యూనియన్ అధ్యక్షుడు రంధి రాజునాయుడు అన్నారు. ఆనందపురంలో మూడు ఆటోస్టాండుల అధ్యక్ష, కార్యదర్శులు ఆధ్వర్యంలో శనివారం కృష్ణరాయుడుపేట రైవాడ కాలువ నుంచి ఆనందపురం ఆటో స్టాండు వరకు ఆటో డ్రైవర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. ఆనందపురం మూడు రోడ్ల సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పైడితల్లి, నీలి కోటి, పి.అవతారం, సారికేశరావు, లోకల శ్రీను, తో పాటు 100 మంది ఆటో వర్కర్సు పాల్గొన్నారు.

సంతోషిమాత హుండీ ఆదాయం రూ.2.58 లక్షలు



ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సంతోషిమాత దేవాలయంలో హుండీ ఆదాయం రెండు లక్షలా 58 వేలా 518 రూపాయలు వచ్చినట్లు ఈవో బి.మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ వి.వసంతకుమార్, చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ హుండీ కానుకలు లెక్కించగా, నాలుగు మాసాలకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. హుండీ ఆదాయం ఒక లక్షా 52 వేలా 048, భక్తుల టికెట్ల ద్వారా ఒక లక్షా 6 వేలా 470 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. గతేడాది హుండీ, టికెట్ల రూపంలో లక్షా 30 వేలు రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. శ్రావణమాసం పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడం వల్ల ఈ ఏడాది హుండీ ఆదాయం పెరిగిందన్నారు. ఈ నగదును దేవదాయ ధర్మదాయ శాఖ బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. ఆలయ అర్చకుడు కామేశ్వరరావు, గుమస్తా పీఎస్‌ఏ సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.